క్లుప్తంగా

ఆదిశంకరాచార్యుల జయంతి



జయంతిలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణం లోని రెండో జోన్‌లో గల రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన గల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను ఆదివా రం విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చి త్రపటం వద్ద భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఆకునూరి లక్ష్మినారాయణ, కటుకొజ్వల వేణు, నూతి తిరుపతి, గుగ్గిళ్ల ర వీంద్రచారి, వీర రాజు, శ్రీనివాస్, రాజేందర్, రమణచారి, వెంకటేశ్వర్లు, రాజమౌళి పాల్గొన్నారు.

సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్

జన్నారం: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జన్నారం మండలంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలో రెండు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆ రెండు కేంద్రాల్లో ఒక్కో కేంద్రంలో ఆరుగురు సిబ్బందిని నియమించామని, మొత్తం జన్నారం మండలంలో 106మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ప్రజలు, ఓటర్లు శాంతియుతంగా ఓటింగ్ జరిగేలా సహకరించాలని కోరారు.

నిరుపయోగంగా కంపోస్టు షెడ్లు



మేదరిపేటలో నిరుపయోగంగా కంపోస్టుషెడ్, పక్కనే పేరుకుపోయిన చెత్త

దండేపల్లి: గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్‌లు నిరుపయోగంగా వదిలేస్తున్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్‌లో వేసి వర్మీకంపోస్టుగా తయారు చేయాలి. కానీ చెత్తను అందులో వేయకుండా రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో పడేసి దహనం చేస్తున్నారు. దీంతో చెత్తను వర్మీకంపోస్టుగా తయారు చేయాల్సిన కంపోస్టు షెడ్‌లు దండేపల్లి మండలంలో చాలా గ్రామాలో నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. దండేపల్లి మండలం మేదరిపేటలో సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్‌లో వేయకుండా, దానిపక్కనే ఆరుబయట వేసి తగుల బెడుతున్నారు. దీంతో అక్కడ కంపోస్టు షెడ్ నిరుపయోగంగా మిగిలిపోయింది. తగులబెట్టిన చెత్తంతా గుట్టగా పేరుకుపోతోంది. అధికారులు స్పందించి కంపోస్టు షెడ్‌లు వినియోగించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పగుళ్లు తేలిన బీటీ రోడ్డు



భీమారం: మండలంలోని పోలంపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో బీటీ రోడ్డు పగుళ్లు తేలడంతో ప్రయాణికులు కష్టాలు పడుతున్నారు. మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారి నుంచి పోలంపల్లి గ్రామానికి చెరువు కట్ట మీద గుండా నిర్మించిన రోడ్డు ధ్వంసం కావడంతో బైక్‌లు, ఆటోల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా కాంట్రాక్టర్ నాణ్యతతో పనులు చేయకపోవడం వల్లే రోడ్డు దెబ్బతిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు ధ్వంసమై సంవత్సరం గడుస్తున్నా, కనీసం మరమ్మతు చేయడంలేదని తెలిపారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని బీటీ రోడ్డులో పగుళ్లు తేలిన చోట మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

‘ఎత్తిపోయని’ పథకం!

కోటపల్లి: పర్యవేక్షణ లేకుంటే ఎంతటి గొప్ప ప్రాజెక్టైనా వ్యర్థమే అనేందుకు ఈ ఉదంతమే నిదర్శనం. దీనిని అక్షరాల నిజం చేశారు నీటిపారుదలశాఖ అధికార యంత్రాంగం. కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామంలో గోదావరి నది ఒడ్డున సాగునీటి అవసరాల కోసం అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 1745 ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ఎత్తిపోతల పథకాన్ని నాబార్డు ఆర్ఐడీఎఫ్ ఆర్థిక సాయంతో రూ.6కోట్ల14లక్షల 40వేలతో నిర్మించారు. ఈ నీటితో కొల్లూర్, బోరంపల్లి, రాంపూర్ గ్రామాల్లోని రైతులు సాగునీటి అవసరాల కోసం నీటిని వినియోగించుకునేవారు.

- నిర్వహణ లోపంతో నీరందని వైనం
- చోరీకి గురవుతున్న బోరంపల్లి లిఫ్ట్ సామగ్రి
- ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్‌నూ వదలని దొంగలు
- పట్టించుకోని అధికారులు



వృథాగా మారిన కొల్లూర్ బోరంపల్లి ఎత్తిపోతల పథకం

కోటపల్లి మండలం బోరంపల్లి గోదావరి నది ఒడ్డున రూ.6కోట్ల14లక్షలతో ఎత్తిపోతల పథకం నిర్మించగా కొల్లూర్ 500, బోరంపల్లి 300, రాంపూర్, దేవులవాడ గ్రామాలకు 945 ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో పథకం నిర్మాణంతో నాబార్డు నిధులు కేటాయించింది. పంపుహౌస్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ యార్డు, విద్యుత్ మోటార్లు ఏర్పాటు పనులను పూర్తి చేశారు. బోరంపల్లి నుంచి దేవులవాడ వరకు పైపులైన్‌తో పాటు నీళ్లను నిల్వ ఉంచి సరఫరా చేసే నీటి కుండీలు నిర్మించారు. నీళ్లు ఎత్తిపోసేందుకు అన్ని పనులను పూర్తి చేసి సాగునీరు అందించేలా అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలంగాణ వచ్చాక సాగునీరుకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం కనీసం ప్రాజెక్టు మరమ్మతుల కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని రైతులు పేర్కొంటున్నారు. ఇన్ని కోట్ల రూపాయలతో నిర్మించినా ఎత్తిపోతల పథకం ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. 2022లో కురిసిన భారీ వర్షాలకు కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పంప్‌హౌస్‌తో పాటు పెద్దపెద్ద మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా మునిగిపోవడంతో కోట్ల రూపాయలు వృథాగా మారింది. దీంతో ఇప్పటి వరకు ఆ ఎత్తిపోతల పథకం వైపు అధికారులు చూసిన పాపాన పోలేదు. దీంతో ఎత్తిపోతల పథకంలో భాగంగా వేసిన లక్షల రూపాయల పంపుసెట్లు, మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగల పాలయ్యాయి. ఇప్పటికే నాణ్యమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌ను దొంగలించుకుని పోయారు. నాణ్యమైన లక్షల రూపాయల విద్యుత్ మోటార్లు మిగిలిపోగా దొంగలు వాటిని కూడా ప్రయత్నించి రాకపోయే సరికి వదిలివెళ్లినట్లు ఆనవాళ్లు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. గోదావరి నది ఒడ్డున ఉండటం, జనసంచారం లేకపోవడంతో దొంగలకు కోట్ల రూపాయల విలువైన సామగ్రి వరంలా మారింది. ఇంతా జరుగుతున్నా అధికారులు కనీసం ఆ ప్రాజెక్టు వైపు చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇదే పరిస్థితి ఉంటే మిగిలిన లక్షల రూపాయల సామగ్రి దొంగలపాలు కాక తప్పదు.



నిరుపయోగంగా మోటార్లు



చోరీ అయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు

సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలి



బోరంపల్లి ఎత్తిపోతల పథకం నుంచి మళ్లీ పంటపొలాలకు సాగునీరు అందించాలి. ఎత్తిపోతల పథకం నుంచి వచ్చే నీటితోనే సాగు చేసుకునేవాళ్లం. ఇప్పుడు రెండోపంటకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే మరమ్మతులు చేయించి పంటకాలం వరకు నీటిని అందించేలా అధికారులు చొరవ చూపాలి.

– దుర్గం రాజారాం, రైతు, బోరంపల్లి

ఘనంగా మాతృ దినోత్సవం



మందమర్రిరూరల్: కేక్ కట్ చేస్తున్న మహిళలు

మంచిర్యాలటౌన్: ప్రపంచ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధ మహిళలను రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ వి.మధుసూధన్ రెడ్డి, రజనీరెడ్డి దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ చందూరి మహేందర్, ఎల్ల కిషన్, ఆశ్రమం నిర్వాహకుడు సదానందం, తిరుమల పాల్గొన్నారు.



వృద్ధులను సన్మానిస్తున్న మధుసూదన్ రెడ్డి

మందమర్రిరూరల్: పట్టణంలో మాతృ దినోత్సవాన్ని మహిళలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చ్‌లో మాతృమూర్తులు కేక్ కట్ చేసి పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో చర్చ్ సభ్యులు రీటారాణి, సంధ్య పలువురు మాతృమూర్తులున్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



దండేపల్లిలో సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



వేంపల్లిలో ఎన్నికల సామగ్రితో సిబ్బంది



శ్రీరాంపూర్‌లో పోలింగ్ కేంద్రంలో...



మాదారం పోలింగ్ కేంద్రం వద్ద...

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/శ్రీరాంపూర్/లక్సెట్టిపేట/తాండూర్/భీమారం/కోటపల్లి/మందమర్రిరూరల్: నియోజకవర్గంలోని ఓటర్లు వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఎన్నికల సంఘం ప్రతీ నియోజకవర్గానికి ఐదు మహిళా, ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలు, ఒక దివ్యాంగ ఎన్నికల సిబ్బంది, ఒక యూత్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆదివారం ఎన్నికల సామగ్రిని తీసుకుని, ఎన్నికల సిబ్బంది గుర్తించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లి సోమవారం జరిగే ఎన్నికల కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, తాగునీటి వసతులతో పాటు ఎండ తీవ్రత దృష్ట్యా నీడకోసం టెంట్లు వేశారు. దివ్యాంగులు, నడవలేని వారి కోసం వీల్‌చైర్స్‌ను అందుబాటులో ఉంచారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. దండేపల్లి మండలంలో 41,301 ఓటర్లకు గాను 49పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలో 29, గ్రామ పంచాయతీలో 18పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలం మొత్తంగా 47 కేంద్రాలుండగా 42547 ఓటర్లు ఉన్నారు. తాండూర్ మండల వ్యాప్తంగా 37 పోలింగ్ కేంద్రాల్లో 27209 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. భీమారం మండలంలో 17పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. హాజీపూర్ మండలంలో 32 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయగా 27,116మంది ఓటర్లు ఉన్నారు. మందమర్రిలో 90 పోలింగ్ స్టేషన్లు ఉండగా 79వేల 52మంది ఓటర్లు ఉన్నారు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివ్యాంగ ఉద్యోగులతో 179 పోలింగ్ కేంద్రంను ఏర్పాటు చేశారు. అందరూ మహిళలే విధులను నిర్వర్తించేలా నియోజకవర్గంలోని మంచిర్యాల జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రం 144, నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం 235, జెడ్పీఎస్ఎస్ దండేపల్లిలో పోలింగ్ కేంద్రం 46, జెడ్పీఎస్ఎస్ దొనబండ, హాజీపూర్ మండలం పోలింగ్ కేంద్రం 98, లక్సెట్టిపేట మండలం అంకతపల్లి ఎంపీపీఎస్ 90 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. యువతను ఆకర్షించేలా మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని 140వ పోలింగ్ కేంద్రంను సిద్ధం చేయగా, ఈ కేంద్రంలోని అధికారులు, ఉద్యోగులు, పోలీసులు తక్కువ వయస్సు గల వారిని నియమించారు. సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో 9పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సింగరేణి ఉద్యోగులకు సోమవారం వేతనంతో కూడిన సెలవును ప్రకటించింది.



జెండావెంకటాపూర్‌లో...



భీమారం మండలం పోలంపల్లికి చేరిన సిబ్బంది



కోటపల్లి: పోలింగ్ సామగ్రితో అధికారులు

మోడల్ పోలింగ్ కేంద్రాలు



అంగ్రాజ్‌పల్లిలో మోడల్ పోలింగ్ కేంద్రం



పోలంపల్లిలో...



జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

భీమారం/చెన్నూర్‌రూరల్/మంచిర్యాలటౌన్: నేడు జరిగే లోక్‌సభ ఎన్నికలకు చెన్నూర్ మండలంలోని అంగ్రాజ్‌పల్లిలో, భీమారం మండలంలోని పోలంపల్లిలో, జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలోని పోలింగ్ కేంద్రం 156, నస్పూరులోని సింగరేణి హైస్కూల్‌లోని 244 పోలింగ్ కేంద్రం, హాజీపూర్ మండలంలోని ముల్కల్ల హైస్కూల్‌లోని 126వ పోలింగ్ కేంద్రం, లక్సెట్టిపేట మండలం గుల్లకోటలోని 94వ పోలింగ్ కేంద్రం, దండేపల్లి మండలంలోని నర్సాపూర్ ఎంపీయూపీఎస్‌లోని 49వ పోలింగ్ కేంద్రంను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లతో తయారు చేసిన ఫ్లెక్సీలను పోలింగ్ కేంద్రం ఎదుట స్వాగత తోరణంలా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం ఆవరణలో టెంట్లు, ఓటర్లు ఓటు వేయడానికి వెళ్లేందుకు గాను మ్యాట్‌ను ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్‌కు ఆకుల తోరణాలతో పాటు అరటి చెట్లతో సుందరంగా తయారు చేశారు.

హాస్టల్ స్థలంపై అక్రమార్కుల కన్ను

- కబ్జాకు గురికావడంతో అధికారులకు ఫిర్యాదు

తాండూర్: మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం స్థలం కబ్జాకు గురైంది. గుట్టు చప్పుడు కాకుండా కొందరు ఆక్రమించడం సంచలనమైంది. విలువైన భూమిని స్వాధీనం చేసుకోవడానికి చేసిన యత్నాలు వెలుగు చూడడంతో ఈ అంశం మండలంలో చర్చనీయాంశమైంది. స్పందించిన సంబంధిత అధికారులు పోలీస్‌స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

ఏం జరిగిందంటే...

హాస్టల్ ప్రాంగణాన్ని ఆనుకొని నివాసం ఉంటున్న కొందరు ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టారు. కొత్తగా కట్టుకున్న ఇంటి చుట్టూరా ప్రహరీ నిర్మించారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్‌డబ్ల్యూవో రవీందర్ గౌడ్, హాస్టల్ వార్డెన్ మల్లేశ్ హాస్టల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. నూతన ప్రహరీ నిర్మాణ విషయంలో గతంలోనే వివాదం ఏర్పడింది. నిర్మాణ పనులు అడ్డుకొని ప్రహరీ నిర్మాణం చేపట్టవద్దని చెప్పినప్పటికీ, ఆ వ్యక్తి ప్రహరీ నిర్మించడంతో వసతి గృహానికి సంబంధించిన స్థలం కొంత అన్యాక్రాంతమైనట్లు అధికారులు గుర్తించారు.



ఇటీవలే నిర్మించిన నూతన ప్రహరీ

ప్రభుత్వ కార్యాలయాల్లో ఫిర్యాదు...

వసతి గృహానికి సంబంధించిన స్థలం కబ్జాకు గురైనట్లు సమాచారం వెళ్లడంతో సంబంధిత అధికారులు వెంటనే స్పదించారు. అన్యాక్రాంతమైన స్థలాన్ని పరిశీలించి తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో, తహసీల్దార్, తాండూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థలం కబ్జాపై విచారణ పూర్తి చేసి చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. ఈవిషయంలో ఆ స్థలం హాస్టల్‌ది కాదని అక్కడ ఉన్న వాచ్‌మెన్ పరోక్షంగా ధ్రువీకరించడం కొసమెరుపు. గతంలో కూడా హాస్టల్‌కు మరో పక్క భూమి కబ్జాకు గురైనప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో హాస్టల్ భూమి కబ్జాపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితేనే నిజాలు నిగ్గు తేలే అవకాశం ఉంది.

వేసవి దుక్కులతో ఎంతో మేలు

దండేపల్లి: పంటల సాగులో వస్తున్న మార్పులు, ఆధునిక పద్ధతులను ఎప్పటికప్పుడు అనుసరిస్తేనే ఆశించిన దిగుబడులు పొందవచ్చని దండేపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి గొర్ల అంజిత్ పేర్కొంటున్నారు. అన్ని రకాల పంటలు సాగు చేయడానికి వేసవిలో దుక్కిదున్నితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. యాసంగి పంట చేతికొచ్చిన తర్వాత కొందరు పొలాన్ని అలాగే వదిలేస్తారు. మళ్లీ వానాకాలం పంట సాగుకు శ్రీకారం చుడతారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగు చేస్తుంటారు. వేసవిలో దుక్కులు దున్ని వేడి చల్లారిన తర్వాత విత్తనాలు విత్తితే ఆశించిన ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



ప్రయోజనాలివీ..

- వేసవిలో దుక్కులు దున్నడంతో కలుపు బెడద తగ్గించుకోవచ్చు. దుక్కులు దున్నకుండా అలాగే వదిలేయడంతో కలుపు బాగా పెరిగి, భూమిలోని పోషక పదార్థాలను తగ్గించి భూసారాన్ని తగ్గిస్తాయి.
- మే, జూన్ నెలలో కురిసే చిరు జల్లులకు దుక్కులు లోతుగా దున్నడం వల్ల, తర్వాత కురిసే వానలకు వర్షం నీళ్లు భూమిలోకి ఇంకి, నాటిన విత్తనం ఏపుగా ఎదిగి అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడతాయి.
- భూమిలోని పొరల్లో దాగి ఉండే కీటకాలు, వాటి గ్రుడ్లు, పంటలకు చీడ పీడలను ఆశించడానికి కారణమయ్యే శిలీంద్రాలు, వేసవి దుక్కులతో బయటపడి ఎండల తీవ్రతకు అవి చనిపోతాయి.
- భూమిలో కోశస్థ దశలో ఉన్న పురుగులు, లార్వాలు, వేసవి దుక్కులు దున్నడంతో బయటపడతాయి. వాటిని పక్షులు ఏరుకుతినడంతో అన్నదాతలకు మేలు చేకూరుతుంది.
- నైరుతి రుతుపవనాలు రాగానే కొంతమంది రైతులు హడావుడిగా దుక్కులు దున్ని సిద్ధం చేసి విత్తనాలు విత్తడంతో, విత్తన మొలక శాతం తగ్గి దిగుబడిపై ప్రభావం పడుతుంది.

కార్మికులకు ఓటు వేసే అవకాశం కల్పించాలి

మంచిర్యాలటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులకు పూర్తి వేతనంతో కూడిన సెలవును ఇచ్చి కార్మికులు స్వేచ్ఛగా ఓటు వేసేలా యాజమాన్యాలు అవకాశం కల్పించాలని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఒక ప్రకటనలో కోరారు. కార్మికుల కు సెలవు దినం ప్రకటించకపోతే వారి అ మూల్యమైన ఓటును వినియోగించుకోలేక పోతారని, ఇందుకోసం జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.